క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగామ రూరల్: మండలంలోని తొర్రగుడిపాడు గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో శనివారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ రూరల్ ఏఈ పూర్ణచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పల్లగిరి, సోమవరం, రుద్రవరం, గోళ్లమూడి, రాఘవాపురం, మగల్లు, కొండూరు, రామిరెడ్డిపల్లి, దాములూరు, కొణతమాత్మాకూరు, జొన్నలగడ్డ గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



తరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదానానికి శుక్రవారం పలువురు భక్తులు విరాళాలు అందజేసినట్లు ఆలయ ఈఓ ఎస్వీ సాంబశివరావు తెలిపారు. తెలంగాణా రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన చైతన్య దంపతులు రూ. 25,116లు, జగ్గయ్యపేటకు చెందిన రాటకొండ గోపాల్ దంపతులు రూ. 10,116లను విరాళంగా అందించారని పేర్కొన్నారు. దాతలకు పూజల అనంతరం స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

నేడు గ్రామాల్లో యోగాంధ్ర

పెనుగంచిప్రోలు: యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం ఏడు గంటలకు గుర్తించిన ప్రదేశాల్లో యోగా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీ శ్రీను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, ఇతర సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, రిజిస్టర్ సిటిజన్స్ అందరూ యోగా కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

మంత్రి నిమ్మలను కలిసిన ఎమ్మెల్యే



జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) శుక్రవారం విజయవాడలోని మంత్రి కార్యాలయంలో కలిసి నియోజకవర్గంలోని సమస్యలను వివరించారు. ఈ మేరకు ఎమ్మెల్యే తాతయ్య వివరాలు తెలిపారు. వత్సవాయి మండలం పోలంపల్లి ప్రాజెక్టు వద్ద మునేరు తువ్వ కాలువకు పడిన గండ్లు, మైసమ్మ గండి వల్ల ఆ ప్రాంత రైతాంగం తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలియజేసినట్లు చెప్పారు. దీనిపై స్పందించిన మంత్రి రామానాయుడు మొత్తం రూ. 3.60 కోట్ల నిధులతో తువ్వ కాలువకు పడిన గండ్లు, మైసమ్మ గండికి తక్షణ మరమ్మతులు చేపట్టే విధంగా ప్రత్యేకంగా టెండర్లను పిలుస్తామని, త్వరలోనే పనులు కూడా చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఎమ్మెల్యేతో పాటు పేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ఏచూరి రాము తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

కంచికచర్ల: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ పేర్కొన్నారు. నందిగామ వై జంక్షన్ వద్ద శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ మేరకు ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. లేకపోతే కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పనిగంటల పెంపును విరమించాలి

ఇబ్రహీంపట్నం: అసంఘటిత రంగ కార్మికుల పని గంటలు పెంచేలా మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాల సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల పనిగంటల పెంపు, రాత్రి వేళల్లో మహిళలు పని చేయాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. ఇబ్రహీంపట్నం సీపీఎం కార్యాలయంలో వివిధ ట్రేడ్ యూనియన్‌ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల హక్కుల హరించే లేబర్ కోడ్స్ రద్దు కోసం జులై 9న చేపట్టే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్, ఉపాధ్యక్షుడు కొండలరావు, వివిధ ట్రేడ్ యూనియన్‌ల నాయకులు పాల్గొన్నారు.

ఊరించి.. ఉసూరుమనిపించి

- కానరాని వరుణుడు
- మండుతున్న ఎండలు
- ఆందోళనలో అన్నదాతలు



విత్తనాలు వేయడానికి సిద్ధంగా ఉన్న పొలాలు

పెనుగంచిప్రోలు: వరుణుడు రైతులతో దోబూచులాడుతున్నాడు. మే నెలలో కురిసిన అకాల వర్షాలు రైతులను పంటల సాగుకు సిద్ధం చేశాయి. కానీ ఇప్పుడు వరుణుడు ఆశపెట్టి ఆవేదన మిగులుస్తున్నాడు. తొలకరి ముందుగా పలకరించడంతో సంతోషంతో రైతులు తమ పొలాలను దుక్కులు దున్ని విత్తనాలు వేయడానికి సిద్ధం చేశారు. అప్పుడప్పుడు పడుతున్న వర్షాలకు కొందరు రైతులు పత్తి విత్తనాలు విత్తారు. ఈలోగా ఎండలు మళ్లీ రోహిణీ కార్తెను మించి ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

వేసవిని తలపిస్తున్న ఎండలు

ఖరీఫ్ సీజన్‌లోనూ ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. ఈ ఎండలకు తోడు ఉక్కపోత కూడా రైతులను కలవర పెడుతోంది. నేలలో తేమ ఆవిరి అయిపోయి విత్తిన విత్తనాలు మొలకెత్తవని రైతులు అంటున్నారు. ఎండల ప్రభావంతో కొందరు రైతులు విత్తనాలు వేయడానికి సాహసించడం లేదు. వర్షాకాలం ప్రారంభమై దాదాపు పదిహేను రోజులు అయింది. రైతులు అందరూ తమ పొలాలను దుక్కులు దున్ని, సాళ్లు తోలి విత్తేందుకు విత్తనాలతో సిద్ధంగా ఉన్నారు. అయితే ప్రస్తుత వాతావరణ పరిస్థితులు అన్నదాతలకు ముందు గొయ్యి, వెనుక నుయ్యి అన్న చందంగా మారాయి. బోర్లు, బావుల కింద రైతులు వరి నారుమళ్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ ఏడాది నియోజకవర్గంలో వరి 7,333 హెక్టార్లు, పత్తి 7,797 హెక్టార్లు, పత్తి 6,973 హెక్టార్లు, మొక్కజొన్న 81 హెక్టార్లు సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

మృగశిర మన్నించేనా..!

మృగశిర కార్తె ఈనెల 8న ప్రారంభమైంది. కార్తె ప్రారంభమైన తర్వాత ఒకరోజు వర్షం పడింది. ఈ కార్తెలో అయినా వర్షాలు సమృద్ధిగా పడతాయని రైతులు ఎదురు చూస్తున్నారు. కాలం అనుకూలిస్తే మృగశిర కార్తెలో భారీ వర్షాలు కురిసి వాతావరణం చల్లబడే పరిస్థితి ఉంటుంది. కానీ జోరుగా వర్షాలు పడాల్సిన సమయంలో ఎండల తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మేలో పడిన అకాల వర్షాలతో ఎండల నుంచి ఉపశమనం పొందినా జూన్ మొదలైన నాటి నుంచి ఎండలు, ఉక్కపోతతో విసిగిపోతున్నారు. ఇప్పటికైనా వరుణుడు కరుణించాలని రైతులు వేడుకుంటున్నారు. వ్యవసాయాధికారులు కూడా మంచి వర్షాలు పడిన తర్వాత విత్తనాలు విత్తుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

అదును దాటితే కష్టం



పలాలు దున్ని సాగుకు సిద్ధం చేశాం. వర్షం కోసం ఎదురుచూస్తున్నాం. వర్షాలు రైతులతో ఆడుకుంటున్నాయి. అదును దాటితే వ్యవసాయం దండగలా మారుతుంది. ఎండలు రోహిణి కార్తెను తలపిస్తున్నాయి.

–తోక కృష్ణ, రైతు, వెల్లుర్తిపాడు

తొందరపడి విత్తుకోవద్దు



సరైన వర్షాలు కురిసి భూమి పదునెక్కాకే రైతులు విత్తనాలు విత్తుకోవాలి. అప్పుడు మాత్రమే మొలక శాతం బాగుంటుంది. తొందరపడి ఒకటి రెండు వర్షాలకే విత్తుకోవద్దు. రైతులు తమ ప్రాంతానికి అనువైన బీటీ పత్తి విత్తనాలు ఎంచుకోవాలి.

–కె. రామసుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి

అడవి ఆవుల సమస్య పరిష్కారానికి కృషి

నందిగామ రూరల్: అడవి ఆవుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆర్డీవో బాలకృష్ణ పేర్కొన్నారు. సమస్య పరిష్కారంలో భాగంగా స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం గూగుల్ మీట్ ద్వారా సత్తెనపల్లి ఆర్డీవో, సంబంధిత మండలాల తహసీల్దార్‌లతో సమావేశం నిర్వహించారు. అడవి ఆవుల సమస్యను వివరించి సంబంధిత సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందర్లపాడు మండలంలోని ఏడు గ్రామాల్లో అడవి ఆవుల సమస్య ఉందని ఇప్పటికే డ్రోన్‌ల సహాయంతో వాటి సంచారాన్ని గుర్తించడం జరిగిందని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చందర్లపాడు మండలంలోని కృష్ణానది అవతలి సరిహద్దులోని పల్నాడు జిల్లా సత్తెపల్లి రెవిన్యూ డివిజన్‌లో గల అమరావతి, అచ్చంపేట మండలాల్లోని కస్తాల, కోసూరు, మునుగోడు, మల్లాది, జీడుగ గ్రామాలకు సంబంధించిన లంక భూములు, సాగు వివరాలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. త్వరలోనే అడవి ఆవుల సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్‌గా తులసీకృష్ణ



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పురపాలక సంఘ నూతన కమిషనర్‌గా డి.వెంకట తులసీకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా విజయనగరం జిల్లా సాలూరు మున్సిపాలిటీ నుంచి బదిలీపై వచ్చిన తులసీకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ఎం.రామ్మోహనరావు గత నెల 31వ తేదీన పదవీ విరమణ చేయగా, ఆయన స్థానంలో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా ఉన్న కలీముల్లాను పూర్తిస్థాయి అడిషినల్ ఇన్‌చార్జ్ కమిషనర్(ఎఫ్ఏసీ)గా పురపాలక శాఖ నియమించింది. కలీముల్లా బాధ్యతలను తులసీకృష్ణకు అప్పగించారు.

బోల్తా కొట్టిన ఇసుక ట్రాక్టర్



తువ్వకాలువలో పడిన ఇసుక ట్రాక్టర్

పెనుగంచిప్రోలు: స్థానిక మేనరు అవతల తువ్వ కాలువలోకి ఇసుక ట్రాక్టర్ బోల్తా కొట్టిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. మునేరు ఇసుక రీచ్ నుంచి లింగగూడెం వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ తువ్వకాలువపై ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి పక్కనే ఉన్న తువ్వకాలువలోకి బోల్తా కొట్టింది. ప్రమాదంలో సీటుకు, స్టీరింగ్‌కు మధ్య ఇరుకున్న డ్రైవర్‌ను స్థానికులు బయటకు తీశారు. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. అయితే ఇసుక ట్రాక్టర్ల వేగాన్ని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామంలో మితిమీరిన వేగంతో ట్రాక్టర్లు నడుపుతున్నారని దీంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు.

తల్లికి వందనంలో కోతలెందుకు?



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

తిరువూరు: అర్హులందరికీ తల్లికి వందనం కింద ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం రకరకాల ఆంక్షలతో పథకాన్ని నీరుగారుస్తోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాస్ విమర్శించారు. తిరువూరు సుందరయ్య భవన్‌లో శుక్రవారం జరిగిన అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల కుటుంబాలకు తల్లికి వందనం నిలిపి వేయడం దారుణమన్నారు. నెలకు రూ.12 వేల ఆదాయంతో కుటుంబం గడవడమే కష్టంగా ఉంటే అంగన్‌వాడీ సిబ్బంది పిల్లలు చదువుకునేందుకు తల్లికి వందనం కింద ఆర్థిక సాయం చేయకపోవడం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నిబంధన సడలించకపోతే ఈ నెల 16న ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల ఎదుట ఆందోళన నిర్వహిస్తామన్నారు. జూలై 9న జరిగే కార్మికుల దేశవ్యాప్త సమ్మెలో కూడా కార్మికులంతా పాల్గొనాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుప్రజ, తిరువూరు మండల కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు, ఆకుల రవి, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు నాగమణి పాల్గొన్నారు.

నందిగామ సీడీపీవోగా లక్ష్మీభార్గవి

నందిగామ రూరల్: ఐసీడీఎస్ సీడీపీవోగా లక్ష్మీభార్గవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీడీపీవోగా పని చేస్తున్న భాగ్యరేణుక పలు ఆరోపణలపై గత కొంత కాలం క్రితం బదిలీ కావడంతో ఇన్‌చార్జ్ సీడీపీవోగా కృష్ణకుమారి బాధ్యతలు నిర్వహించారు. చిల్లకల్లు సీడీపీవోగా పని చేస్తున్న లక్ష్మీభార్గవి బదిలీపై నందిగామకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకునేలా అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే అంగన్‌వాడీల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. సూపర్‌వైజర్‌లు కరుణకుమారి, వెంకట్రావమ్మ, కరీమా, తారాభి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆమెకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

ఇబ్రహీంపట్నం: విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల ఎస్ఈ టి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ మీటర్ల విస్తృత తనిఖీ శుక్రవారం నిర్వహించారు. 46 మంది అధికారులు, 189 మంది సిబ్బంది 46 బృందాలుగా ఏర్పడి 4,682 సర్వీసులను తనిఖీ చేశారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 486 మందికి రూ.8.06 లక్షల అపరాధ రుసుం విధించారు.విజిలెన్స్ విభాగం ఈఈ విజయకుమారి, డీఈలు గురు కిశోర్, సుధాకర్, స్టాలిన్‌కుమార్, శ్రీనివాసరావు, ఏఈ కె.వెంకన్న తదితరులు పాల్గొన్నారు. రూరల్ డివిజన్ ఆపరేషన్ విభాగం ఎస్ఈ వసంతరావు పర్యవేక్షించారు.

ఎన్‌సీసీ క్యాంపులో బాలికలకు అస్వస్థత

ఇబ్రహీంపట్నం: కేతనకొండ సీబీఆర్ అకాడమీలో వారం రోజులుగా జరుగుతున్న 10వ ఆంధ్ర బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ క్యాంపులో శుక్రవారం ఇద్దరు బాలికలు అస్వస్థతకు గురయ్యారు. వారం రోజులుగా నిర్వహిస్తున్న క్యాంపులో ఎక్కువగా కొండపల్లి ఖిల్లాపై నిర్వహిస్తున్నారు. విశ్రాంతి లేకుండా నిర్వహించడం, ఎండ తాకిడికి బాలకలు శ్వాస కూడా తీసుకోలేక పోతున్నారు. శిబిరంలోని అధికారులు బాలికలను స్థానిక పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మద్యం కేసులో రూ. లక్ష జరిమానా

మైలవరం: రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట లంబాడీ తండాకు చెందిన బారోతు పవన్‌కుమార్ అనధికారికంగా మద్యం సీసాలు కలిగి ఉండటం వంటి నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో నిందితునికి తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జె. సుశీలాదేవి రూ. లక్ష జరిమానా విధించారు. గ్రామంలో మద్యం అమ్మకాలు, అనుమతి లేని లిక్కర్ సీసాలు కలిగి ఉండటం నేరమని, ఇలాంటి వారిపై కేసులు నమోదుచేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫర్నీచర్ షాపులో అగ్నిప్రమాదం



పేటలో అగ్నిప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఫర్నీచర్ షాపు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న పద్మావతి షాపింగ్ కాంప్లెక్స్‌లోని క్రిస్టల్ ఫర్నీచర్ షాపులో శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించింది. భారీ స్థాయిలో మంటలు ఎగిసిపడుతుండటంతో మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక శాఖ సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో షాపులోని సెంట్రల్ ఏసీ వద్ద ఒక్కసారిగా మంటలు రావడంతో షాపులోని ఫర్నీచర్‌కు మంటలు వ్యాపించాయి. షాపు నిర్వాహకులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో 25 శాతం షాపులోని వస్తువులు దగ్ధమయ్యాయి. ఫర్నీచర్ చాలా వరకు దగ్ధం కావడంతో ఈ ప్రమాదంలో సుమారు రూ. 10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ఫైర్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డుపై జారుడు మట్టిని తొలగించరూ..



పరిటాల శివారు దొనబండ రాతి క్వారీల సమీపంలో నేషనల్ హైవేపై నల్లమట్టి

కంచికచర్ల: మండలంలోని పరిటాల శివారు దొనబండ రాతి క్వారీల నుంచి నిత్యం భారీగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ వాహనాలన్నీ క్వారీల రోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపైకి వస్తుంటాయి. దీంతో హైవే పక్కన క్వారీ రోడ్డులో పెద్ద పెద్ద గోతులు ఏర్పడటంతో వాహనాలు వచ్చే సమయంలో మురుగునీరుతో పాటు పాచిపట్టిన నల్లమట్టి జాతీయ రహదారిపై పేరుకుపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అంతేకాకుండా ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు బురదకయ్యగా మారిన రోడ్డు వద్దకు రాగానే పల్టీ కొట్టి గాయాలపాలవుతున్నారు. రోడ్డుపై ఏర్పడిన గోతులను పూడ్చాలని అధికారులకు, క్వారీ నిర్వాహకులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి క్వారీ రోడ్డులో మట్టిని తొలగించి గోతులను పూడ్చాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యేలు సౌమ్య, వసంత కృష్ణప్రసాద్

నందిగామ టౌన్: కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో ఎన్నో నూతన విధానాలకు శ్రీకారం చుడుతోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక కమ్మ కల్యాణ మండపంలో ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో నియోజకవర్గ, మండల, పాఠశాల స్థాయిలో టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులకు కమ్మ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ధీటుగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. చదువుతో ఏదైనా సాధించవచ్చని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ కోట వీరబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కమ్మ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్త నిల్వ కేంద్రాన్ని అందుబాటులోకి తేవాలి



పేటలోని ప్రభుత్వాస్పత్రిలో మూతపడిన రక్తం నిల్వ కేంద్రం

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో ఇప్పటి వరకు ఉన్న రక్త నిల్వ కేంద్రాన్ని వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని సీపీఐ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో గత 15 రోజుల నుంచి రక్తం నిల్వల కేంద్రం మూతపడిందన్నారు. పలు అభియోగాలను దృష్టిలో పెట్టుకొని ఇందులో పనిచేస్తున్న ఇద్దరు వ్యక్తులను జిల్లా వైద్యశాఖ అధికారులు తొలగించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ప్రభుత్వాస్పత్రి చుట్టుపక్కల ప్రమాదాలు సంభవిస్తే అత్యవసరంగా క్షతగాత్రులకు రక్తదానం ఎంతో అవసరమవుతుందని తెలిపారు. గతంలో దొడ్డిదారిన రక్త నిల్వల ప్రైవేటు దందాను నివారించడానికి ప్రభుత్వాస్పత్రిలో దాతల నుంచి రక్తాన్ని సేకరించి భద్రపరచుటకు ప్రభుత్వ రక్త నిల్వల కేంద్రాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. దీనిని ఆసరాగా తీసుకున్న కొందరు వ్యక్తులు సిబ్బందితో కలిసి రక్తం నిల్వల కేంద్రాన్ని పక్కదారి పట్టించేలా చేయడంతో వ్యవహారం కాస్త బయటకు పొక్కడం, సిబ్బంది మధ్య పలు విభేదాలు రావడంతో అధికారులు విచారణ చేసి సిబ్బందిని తొలగించారు. ప్రభుత్వం వెంటనే పట్టణ ప్రభుత్వ వైద్యశాలలోని రక్త నిల్వల కేంద్రంలో సిబ్బందిని ఏర్పాటుచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని ప్రభుత్వాన్ని కోరారు.

మంచి చేసేవారు బదిలీపై వెళ్లడం బాధాకరం

ఆర్డీవో బాలకృష్ణ



కమిషనర్ అభినందన సభలో మాట్లాడుతున్న ఆర్డీవో బాలకృష్ణ

నందిగామ రూరల్: ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు బదిలీలు, ఉద్యోగ విరమణలు సర్వ సాధారణమని కానీ ప్రజలకు మంచి చేసే అధికారులు బదిలీపై వెళితే తోటి అధికారులు, సిబ్బందికి ఒకింత బాధగా ఉంటుందని ఆర్డీవో బాలకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ రమణబాబు అభినందన సభను శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల సమయంలో కమిషనర్‌గా రమణబాబు అందించిన సేవలు మరువలేనివన్నారు. అంతేకాకుండా దీర్ఘకాలంగా పట్టణంలో అపరిష్కృతంగా నెలకొని ఉన్న తాగునీటి సమస్యతో పాటు పారిశుద్ధ్య నిర్వహణకు శక్తి వంచన లేకుండా పని చేశారని గుర్తుచేశారు. కమిషనర్ రమణబాబు మాట్లాడుతూ తనకు ఇంత కాలం అండగా ఉండి ప్రజలకు మంచి చేయడంలో సహకరించిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కమిషనర్‌ను అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీఐ వైవీఎల్ నాయుడు, ఏఈ ఫణి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కృష్ణ, జ్వాలా, రామిరెడ్డి శ్రీధర్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్ల ప్రదానం

తిరువూరు: స్థానిక హర్ష కరాటే ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొంది బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి తిరువూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ కె. గిరిబాబు బ్లాక్ బెల్టులను శుక్రవారం ప్రదానం చేశారు. తిరువూరుకు చెందిన కొల్లిపర సూర్య విజయవైష్ణవి, సూర్యనారాయణ బద్రి ప్రభాస్, వీరవల్లి లక్ష్మీదీపక్, కంకట కార్తికేయలకు బ్లాక్ బెల్టులను సీఐ అందజేశారు. కరాటే ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు మోతి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా..?



వత్సవాయి నుంచి పాతవేమవరం వెళ్లే రహదారిలో రైలు కట్ట వద్ద ఏర్పడిన గోతులు



పాతవేమవరం వద్ద కుంగిన రహదారి



కొత్త వేమవరం వద్ద కుంగి గోతులు పడిన రోడ్డు

వత్సవాయి మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు అత్యంత ప్రమాదకరంగా మారాయి. రోడ్లు కుంగిపోవడంతో పాటు పెద్ద పెద్ద గుంతలు పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం వత్సవాయి నుంచి కొత్తవేమవరం వరకు రహదారి మొత్తం కుంగిపోయి గోతులు పడ్డాయి. లింగాల వద్ద మునేరు కాజ్‌వే మరమ్మతుల కారణంగా వాహనాలను వత్సవాయి నుంచి వేమవరం మీదుగా పెనుగంచిప్రోలు మళ్లించారు. దీంతో అధిక లోడుతో భారీ వాహనాలు తిరగడం వల్ల రహదారి మొత్తం అధ్వానంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రహదారుల మరమ్మతులపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– వత్సవాయి